క్లుప్తంగా

చిలుకూరు ఎస్‌ఐగా సురేష్‌రెడ్డి


బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్‌ఐ సురేష్‌రెడ్డి

చిలుకూరు : చిలుకూరు మండల నూతన ఎస్‌ఐగా సురేష్‌రెడ్డి ఆదివారం పోలీస్‌స్టేషన్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని తెలిపారు.

బీసీలు ఐక్యంగా ముందుకు సాగాలి

మఠంపల్లి : సమాజంలో అత్యధిక జనాభాగా ఉన్న బీసీలందరూ ఐక్యంగా ఉండి ముందుకు సాగాలని బీసీ కులాల ఐక్యవేదిక జిల్లా నాయకుడు బీవీ రామారావు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి సంఘం నాయకులతో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం స్థానిక ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో సంఘం నాయకులు జాల కిరణ్‌యాదవ్, మల్లికంటి కృష్ణ, వెంకటేశ్వర్లు, ప్రకాశ్‌బాబు, లక్ష్మయ్య, మహేష్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, శ్రీనివాస్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత విద్యుత్ బకాయిలు చెల్లించాలి

హుజూర్‌నగర్ : రజకులు, నాయీ బ్రాహ్మణులకు చెందిన లాండ్రీ, తదితర దుకాణాలకు సంబంధించి ఉచిత విద్యుత్ బకాయిలు ప్రభుత్వం వెంటనే చెల్లించాలని తెలంగాణ రజక సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకన్న కోరారు. ఆదివారం హుజూర్‌నగర్‌లోని టౌన్ హాల్ నిర్వహించిన నియోజకవర్గస్థాయి రజకుల ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం రజక సేవా సంఘం నియోజకవర్గ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా లక్ష్మయ్య, ఉపాధ్యక్షుడిగా లింగయ్య, కార్యదర్శిగా జానయ్య, కోశాధికారిగా వెంకటయ్య, సహాయ కార్యదర్శిగా గోవింద్, కమిటీ సభ్యులుగా వెంకట్, పున్నయ్య, కృష్ణ, సైదులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా మహాసభ కరపత్రం ఆవిష్కరణ


మహాసభల కరపత్రం ఆవిష్కరిస్తున్న శీలం శ్రీను, నాయకులు

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్‌లో ఈనెల 23వ తేదీన నిర్వహించబోయే తెలంగాణ మత్స్యకారుల మత్స్య కార్మిక సంఘం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శీలం శ్రీను కోరారు. ఆదివారం హుజూర్‌నగర్‌లోని అమరవీరుల స్మారక భవనంలో ఆయన మహాసభ కరపత్రం ఆవిష్కరించి మాట్లాడారు. మహాసభలో మత్స్యకారులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో నాయకులు ఎస్ పాండు, పల్లె వెంకటరెడ్డి, పి హుస్సేన్, మల్లయ్య, సాంబయ్య, తిరపయ్య, వెంకటి, కనకమ్మ, యశోద, తదితరులు పాల్గొన్నారు.

భగవద్గీత పఠనంతో జ్ఞానం పెంపొందుతుంది


భగవద్గీత గురించి వివరిస్తున్న హషికేశ దాస్

హుజూర్‌నగర్ : భగవద్గీత పఠనంతో జ్ఞానం పెంపొందుతుందని భగవద్గీత ప్రచారకులు హషికేశ దాస్ అన్నారు. ఆదివారం హుజూర్‌నగర్‌లోని కన్యకా పరమేశ్వరి అమ్మవారి సత్రంలో భగవద్గీత సత్సంగం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భగవద్గీత చదవడం వల్ల మనస్సును ఎలా నియంత్రించుకోవాలి, జీవన విధానం ఎలా ఉండాలి, మనిషి మనోవైఖరి ఎలా ఉండాలనేది అర్థమవుతుందని తెలిపారు. మానవుడు భగవద్గీతను అనుసరించి జీవించాలన్నారు. అప్పుడే అతని జన్మ సార్థకమవుతుందని చెప్పారు. అనంతరం ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక సంఘం నాయకులు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

ఎత్తిపోతల పథకం నిర్వహణకు సహకరించాలి

మునగాల : మండలంలోని సాగర్ ఎడమ కాలువపై నిర్మించిన ఎల్-33 ఎత్తిపోతల పథకం నిర్వహణకు ఆయకట్టు రైతులు సహకరించాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొప్పుల జైపాల్‌రెడ్డి, కోదాడ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కాసర్ల కోటేశ్వరరావు కోరారు. ఆదివారం మండల కేంద్రంలోని రైతువేదికలో మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఎల్-33 ఎత్తిపోతల పథకం మొదటి, రెండవ స్టేజీ రైతుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఎత్తిపోతల పథకానికి ఆరుగురు రైతులతో తాత్కాలిక కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉప్పుల జానకిరెడ్డి, కాసర్ల వెంకట్, వేట శివాజీ, గడ్డం వినోద్, దేవినేని నాగేశ్వరరావు, పనస అంజయ్యను ఎన్నుకున్నారు. తాత్కాలిక కమిటీకి రైతులు సహకరించాలని వారు కోరారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, ఆయకట్టు రైతులు తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల సాగుతో లాభాలు

నిత్యం ఆదాయం పొందుతున్న రైతులు

- నడిగూడెంలో సేంద్రియ పద్ధతిలో తీగ జాతి పంటల సాగు
- వేణుగోపాలపురంలో నిమ్మలో అంతరపంటగా..
- మార్కెట్‌తో పాటు నేరుగా కొనుగోలుదారులకు విక్రయం


వెంకట్రాంపురంలో సాగులో ఉన్న బెండ

నడిగూడెం : మండలంలో పలువురు రైతులు కూరగాయల సాగు చేస్తూ నిత్యం ఆదాయం పొందుతున్నారు. తమకున్న భూమిలో ఒక ఎకరం విస్తీర్ణంలో సొర, బీర, దోస, కాకర వంటి తీగ జాతితో పాటు బెండ పంటల సాగు చేపడుతూ ఆదర్శంగా నిలుస్తున్నారు. నీటి సౌకర్యం ఉన్నప్పటికీ నిత్యం ఆదాయం వస్తుందని కూరగాయల సాగుపై మొగ్గు చూపుతున్నారు. వీరు నడిగూడెం మార్కెట్‌తో పాటు, ఆయా గ్రామాల్లోనే కూరగాయలను విక్రయించుకుంటూ ఆదాయం పొందుతున్నారు.

పందిరి సాగులో ఆదర్శం..

మండల కేంద్రానికి చెందిన దున్న రవి తనకున్న ఎకరం విస్తీర్ణంలో వెదురు కర్రలతో పందిరి ఏర్పాటు చేసి సొర, బీర, దోస, కాకర పంటలను మల్చింగ్ పద్ధతిలో సాగు చేస్తున్నారు. అలాగే గోంగూర సాగు చేపట్టాడు. ఎలాంటి రసాయన ఎరువులు వాడకుండా పశువుల ఎరువు, చెరువు మట్టి, వేప నూనె లాంటివి ఉపయోగిస్తూ తక్కువ పెట్టుబడితో గత రెండు నెలలుగా ఆదాయం పొందుతూ రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నాడు. ఆయన పండించిన పంటను నడిగూడెం కూరగాయల మార్కెట్‌లో, మండల కేంద్రంతో పాటు చాకిరాల, రత్నవరం, రామాపురం, ఎకలాస్‌ఖాన్‌పేట, శ్రీరంగాపురం గ్రామాల ప్రజలకు విక్రయిస్తున్నాడు. ప్రధాన రహదారి వెంటే చేను ఉండడంతో ప్రజలు కొనుగోలు చేస్తున్నారు.

తోట దగ్గరికే కొనుగోలుదారులు..

మండలంలోని కరివిరాల ఆవాస గ్రామమైన వెంకట్రాంపురం గ్రామానికి చెందిన చిత్తలూరి శ్రీనివాసరావు గత ఏడాది కాలంగా ఆయనకున్న వ్యవసాయ భూమిలో ఎకరం విస్తీర్ణంలో బెండ, సొర, బీర, దోస పంటలను సాగు చేస్తున్నాడు. ఆయన పండించిన పంటలను నడిగూడెం, మునగాల, చిలుకూరు మండలాలలోని కూరగాయల వ్యాపారులకు విక్రయిస్తూ నిత్యం ఆదాయం పొందుతూ తోటి రైతులకు ఆదర్శంగా నిలస్తున్నాడు. అలాగే గ్రామ ప్రజలు ఆయన తోట వద్దకు వెళ్లి తాజా కూరగాయలను కొనుగోలు చేస్తున్నారు.

నిమ్మలో అంతరపంటగా సొర..

వేణుగోపాలపురంనకు చెందిన గోలి పాపయ్య తనకున్న ఎకరం భూమిలో వేసవి కాలం నుంచి సొర సాగు చేపట్టాడు. పండించిన పంటను నడిగూడెం మార్కెట్‌తో పాటు వేణుగోపాలపురంలో విక్రయిస్తూ నిత్యం ఆదాయం పొందుతున్నాడు.


నడిగూడెంలో సాగులో ఉన్న సొర పంట

నిత్యం ఆదాయం వస్తోంది



గత వేసవిలో సొంత ఖర్చులతో వెదురు కర్రలతో పందిరి వేయించి తీగ జాతి పంటలైన సొర, బీర, కాకర, దోస పంటలను సేంద్రియ పద్ధతిలో సాగు చేస్తున్నాను. నడిగూడెం మార్కెట్‌లో కూరగాయలు విక్రయిస్తున్నాను. చుట్టు పక్కల గ్రామాల రైతులు నా దగ్గర కూరగాయలు కొనుగోలు చేస్తారు. నిత్యం ఆదాయం వస్తోంది.

– దున్నా రవి, రైతు, నడిగూడెం

ప్రభుత్వం సాగుకు రాయితీలు ఇవ్వాలి



గత ఏడాది కాలంగా ఒక ఎకరంలో కూరగాయల సాగు చేస్తున్నాను. బెండ, సొర, బీర, కాకర, దోస కూరగాయలు సాగు చేస్తున్నా. నేను పండించిన కూరగాయలు నడిగూడెం మార్కెట్‌లో విక్రయిస్తున్నాను. కూరగాయల సాగు చేసే రైతులకు ప్రభుత్వం రాయితీపై విత్తనాలు, ఎరువులు, డ్రిప్ మంజూరు చేసి ప్రోత్సహిస్తే బాగుంటుంది.

– చిత్తలూరి శ్రీనివాస్, రైతు, వెంకట్రాంపురం

23 ఏళ్ల తర్వాత ఒకే వేదికపైకి..


ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

గరిడేపల్లి : మండలంలోని కల్మలచెరువు గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2001- 02 విద్యా సంవత్సరంలో పదవ తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా జరుపుకున్నారు. 23 ఏళ్ల తర్వాత ఒకే వేదికపై కలుసుకున్న పూర్వ విద్యార్థులంతా ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. పాఠశాల నాటి జ్ఞాపకాలను నెమరవేసుకుని ఆనందంగా గడిపారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన అధ్యాపకులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

లలితాదేవి సేవలు మరువలేనివి


లలితాదేవిని సన్మానిస్తున్న గ్రంథాలయ సంస్థ చైర్మన్ రామారావు, తదితరులు

మునగాల : గ్రంథాలయాధికారిణిగా దేవబత్తిని లలితాదేవి అందించిన సేవలు మరువలేనివని గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ వంగవేటి రామారావు అన్నారు. మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయంలో 18 ఏళ్ల పాటు గ్రంథాలయాధికారిణిగా విధులు నిర్వర్తించి గత నెల 30న పదవీ విరమణ పొందిన లలితాదేవికి ఆదివారం గ్రంథాలయంలో నిర్వహించిన పౌరసన్మాన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. లలితాదేవి తన విధి నిర్వహణలో భాగంగా స్వయంగా పలు పోటీపరీక్షల పుస్తకాలను కొనుగోలు చేసి ఎందరో నిరుద్యోగులకు ఉపయోగపడిందన్నారు. పదవీ విరమణ అనంతరం కూడా నిరుద్యోగ అభ్యర్థులకు సేవలందించాలని కోరారు. అనంతరం లలితాదేవిని ఆయన శాలువాతో ఘనంగా సత్కరించారు. పౌరసన్మాన కార్యక్రమంలో కోదాడ కేఆర్ఆర్ కళాశాల రిటైర్డు ప్రిన్సిపాల్ అర్వపల్లి శంకర్, ప్రముఖ విద్యావేత్త పందిరి నాగిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కందిబండ సత్యనారాయణ, టీడీపీ నాయకుడు సుంకర అజయ్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉప్పుల యుగంధర్‌రెడ్డి, గంధం సైదులు, సీపీఐ నాయకులు చిల్లంచర్ల ప్రభాకర్, గ్రామపెద్దలు, పాఠకులు, నిరుద్యోగులు, ప్రస్తుత గ్రంథాలయ ఇన్‌చార్జ్ అనంతుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

దైవ చింతనతోనే మానసిక ప్రశాంతత


ప్రవచనకర్త రవికుమార్ దంపతులను సన్మానిస్తున్న వికాస తరంగిణి సభ్యులు, స్థానికులు

హుజూర్‌నగర్ : దైవచింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని మధురభారతి బిరుదాంకితులు ప్రవచనకర్త డాక్టర్ రవికుమార్ ఆచార్య అన్నారు. హుజూర్‌నగర్ పట్టణంలోని శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో శనివారం రాత్రి వికాస తరంగిణి ఆధ్వర్యంలో శ్రీ వేంకటాచల మహాత్మ్యం – బ్రహ్మోత్సవ వైభవ ప్రవచన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ మన భారతీయ పురాణాలను తెలుసుకుని ధర్మాన్ని అనుసరిస్తూ జీవించాలని చెప్పారు. అనంతరం రవికుమార్ ఆచార్య దంపతులను వికాస తరంగిణి సభ్యులు, స్థానికులు సన్మానించారు. ఈ కార్యక్రములో వికాస తరంగిణి అధ్యక్షురాలు కె.కళావతి, జి.భారతమ్మ, వి.పద్మావతి, సుజాత, పద్మ, కె.రామ్మోహన్, రంగాచార్యులు, శ్రీనివాసచార్యులు, జగన్నాథస్వామి, కె.కళావతి, ఇందిర, లక్ష్మి, అరుణమ్మ, స్వామి, కుమారి, కృష్ణవేణి, జయప్రద, పి.వెంకటేశ్వర్లు, పి.నరసింహారావు, జి.రంగారావు తదితరులు పాల్గొన్నారు.

చెట్ల పెంపకానికి ప్రాధాన్యం ఇవ్వాలి


గుట్టల ప్రాంతంలో సీడ్‌బాల్స్ చల్లుతున్న సూపరింటెండెంట్ మంగతా, సిబ్బంది

హుజూర్‌నగర్ : ప్రతిఒక్కరూ చెట్ల పెంపకానికి ప్రాధాన్యం ఇవ్వాలని హుజూర్‌నగర్ సబ్ జైల్ సూపరింటెండెంట్ మంగతా అన్నారు. ఆదివారం స్థానిక సబ్ జైల్ సిబ్బందితో కలిసి పట్టణ శివారులోని మిట్స్ కాలేజీ పరిసర ప్రాంతంలో గల గుట్టల ప్రదేశంలో వివిధ విత్తన బంతులు (సీడ్ బాల్స్) చల్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఖాళీ ప్రదేశాల్లో చెట్లు పెంచాలని అన్నారు. పర్యావరణ పరిరక్షణలో ప్రతిఒక్కరూ భాగం కావాలని కోరారు. కార్యక్రమంలో జైల్ హెడ్ వార్డర్ మంత్రిప్రగడ సీతయ్య, వార్డర్లు భాస్కర్, ప్రవీణ్, అజయ్ పాల్గొన్నారు.

శాంతి భద్రతల కోసమే కార్డన్ సెర్చ్

సూర్యాపేటటౌన్ : శాంతిభద్రతల పరిరక్షణ కోసం కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్నట్లు డీఎస్పీ ప్రసన్నకుమార్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని రాజీవ్ నగర్ చౌరస్తా వద్ద ఆదివారం రాత్రి కార్డన్ సెర్చ్ ద్వారా పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడారు. సైబర్ నేరాలు, గంజాయి, మాదక ద్రవ్యాల వల్ల అనర్థాలు తదితర అంశాలపై ప్రజలకు వివరించారు. పట్టణంలో ఎవరైనా అనుమానిత వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. సరైన పత్రాలు లేని ద్విచక్ర వాహనాలను సీజ్ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ సీఐ వెంకటయ్య, రూరల్ సీఐ రాజశేఖర్, పట్టణ ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

జూలకంటి రంగారెడ్డి పరామర్శ

నేరేడుచర్ల : నేరేడుచర్ల పట్టణంలో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన సీపీఎం పట్టణ కార్యదర్శి కొదమగుండ్ల నగేష్, సీఐటీయూ మండల కన్వీనర్ నీలా రామ్మూర్తిలను ఆదివారం మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, సీపీఎం సూర్యాపేట జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వారి వెంట సీపీఎం నేత నాగారపుపాండు తదితరులు ఉన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం


అన్నదానం చేస్తున్న దాతలు

మునగాల : మండలంలోని ముకుందాపురం గ్రామ పంచాయతీ శివారులో గల ఇందిర అనాథ వృద్ధాశ్రమంలో ఆదివారం మఠంపల్లి మండలం చౌటపల్లి గ్రామానికి చెందిన బేత సైదిరెడ్డి –బుచ్చమ్మ జ్ఞాపకార్థం కుమారుడు బేత ప్రతాపరెడ్డి.. వృద్ధులు, అనాథలు, మానసిక వికలాంగులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ వ్యవస్థాపకురాలు నాగిరెడ్డి విజయమ్మ, ఇన్‌చార్జ్ వాచేపల్లి జ్యోతి, దాత కుటుంబసభ్యులు బేత కోటమ్మ, బేత సంజీవరెడ్డి, యలమంచలి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అనాథ ఆశ్రమంలో..

హుజూర్‌నగర్ : పట్టణంలోని జీప్సీ అనాథ ఆశ్రమంలో ఆదివారం డాక్టర్ సాయి చందన్ పుట్టిన రోజు సందర్భంగా చిన్నారులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో నగేష్ రాథోడ్, ముల్కపల్లి రాంబాబు, నర్సింహారావు, శ్రీనివాస్, హన్ను, సాయి, దన్వాల్ పాల్గొన్నారు.

ఘనంగా తీజ్ పండుగ


వేడుకలో పాల్గొన్న గిరిజనులు

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : చింతలపాలెం మండలంలోని గాంధీనగర్ తండాలో గిరిజనులు ఆదివారం తీజ్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా గిరిజన యువతులు, మహిళలు గోధుమనారు బుట్టల తలపై ఎత్తుకొని ఊరేగింపుగా ఆలయానికి వెళ్లారు. వర్షాలు కురిసి పంటలు సమృద్ధిగా పండాలని, పశువులకు వ్యాధులు సోకకుండా ఆరోగ్యంగా ఉండాలని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, తండా పెద్దలు, గిరిజనులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో గ్రామ పంచాయతీ కార్యాలయం


శిథిలావస్థకు చేరిన తెల్లబల్లి జీపీ కార్యాలయం

నడిగూడెం : మండల పరిధిలోని తెల్లబల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం భవనం శిథిలావస్థకు చేరింది. 40 ఏళ్ల క్రితం నిర్మించిన ఈ భవనం వెనుక భాగం పూర్తిగా దెబ్బతిన్నది. బయట, లోపల గోడలు పెచ్చులూడుతున్నాయి. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని సంబంధిత సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత్యంతరం లేక వరండాలోనే విధులు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం స్పందించి నూతన భవనాన్ని నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

3న కోదాడలో ముత్యాలమ్మ బోనాల పండుగ


సమావేశంలో ముత్యాలమ్మ ఆలయ, రైతు కమిటీ సభ్యులు, పట్టణ పెద్దలు

కోదాడరూరల్ : శ్రావణమాసం పురస్కరించుకొని కోదాడ పట్టణంలో వచ్చే నెల 3న ముత్యాలమ్మ బోనాల పండుగను నిర్వహించనున్నట్లు ముత్యాలమ్మ ఆలయ కమిటీ, రైతు కమిటీ సభ్యులు, పట్టణ పెద్దలు తెలిపారు. ఆదివారం పట్టణంలోని ముత్యాలమ్మతల్లి ఆలయం ఆవరణలో నిర్వహించిన సమావేశంలో అందరు కలిసి ఏకగ్రీవంగా ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఈ పండుగను నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. పండుగ రోజున పట్టణ ప్రజలు అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆయా కమిటీల సభ్యులు, పట్టణ పెద్దలు ఉన్నారు.

‘దొడ్డా’ జీవితం స్ఫూర్తిదాయకం


గరిడేపల్లి : నారాయణరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

గరిడేపల్లి : స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, కమ్యూనిస్టు నాయకుడు దొడ్డా నారాయణరావు జీవితం అందరికీ స్ఫూర్తిదాయకమని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పోకల వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం గరిడేపల్లి మండల కేంద్రంతో పాటు మండలంలోని గానుగబండ, కొండాయిగూడెం గ్రామాల్లో దొడ్డా నారాయణరావు సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నారాయణరావు తన 96 సంవత్సరాల జీవన ప్రయాణంలో ఏనాడు విలువలకు తిలోదాకాలు ఇవ్వకుండా నిబద్ధత, నిజాయితీ, క్రమశిక్షణతో ఉన్నారని అన్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి కడియాల అప్పయ్య, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి త్రిపురం సుధాకర్ రెడ్డి, సీపీఐ మండల కార్యవర్గ సభ్యుడు యడ్ల అంజిరెడ్డి, కుందూరు వెంకటరెడ్డి, పోకల ఆంజనేయులు, ప్రధాని సైదులు, పంగ గోవింద్, షేక్ నభిసాబ్, పీర్‌సాబ్, గోధుమల నాగాచారి, ఈశ్వరచారి, హిమాంబి, బక్కమ్మ, పీరాంబి, అనసూయ తదితరులు పాల్గొన్నారు.

నిరాడంబర నాయకుడు దొడ్డా నారాయణరావు

అనంతగిరి : నిరాడంబర జీవితాన్ని గడిపిన కమ్యూనిస్టు నాయకుడు దొడ్డా నారాయణరావు అని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బద్దం కృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ఎన్‌టీఆర్ చౌరస్తాలో దొడ్డా నారాయణరావు సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. దొడ్డా నారాయణరావు కమ్యూనిస్టు పార్టీలో కార్యకర్త స్థాయి నుంచి అనేక పదవులు చేపట్టి చివరి శ్వాస వరకు జీవితాన్ని పార్టీకే అంకితం చేశాడని అన్నారు. సాయుధ పోరాటంలో ఎత్తిన ఎర్ర జెండా చివరి వరకు విడువని మహానాయకుడు అని కొనియాడారు. కార్యక్రమంలో యువజన అధ్యక్షుడు డేగ వీరన్న, మాజీ సర్పంచ్ వేనేపల్లి వెంకటేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి నాగభద్రం, రైతు సంఘం మండల అధ్యక్షుడు నాగేశ్వరరావు, సహాయ కార్యదర్శి లాలు, వీరబాబు, పార్టీ సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంతాప సభ కరపత్రం విడుదల

నేరేడుచర్ల : చిలుకూరులో ఈనెల 21వ తేదీన నిర్వహించబోయే అమరజీవి దొడ్డా నారాయణరావు సంతాప సభ కరపత్రాన్ని ఆదివారం సీపీఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు దూళిపాల ధనుంజయనాయుడు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దొడ్డా నారాయణరావు సంతాప సభను విజయవంతం చేసేందుకు పార్టీ కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కత్తి శ్రీనివాస్‌రెడ్డి, యల్లబోయిన సింహాద్రి, చిలకరాజు శ్రీను, రావుల సత్యం, వెంకట్, భరత్ తదితరులు ఉన్నారు.


నేరేడుచర్ల : సంతాప సభ కరపత్రం విడుదల చేస్తున్న సీపీఐ నాయకులు


అనంతగిరి : దొడ్డా నారాయణరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

మునగాలలో వరుస చోరీలు


మునగాల : మునగాల మండల కేంద్రంలో గత నెలరోజులుగా వరుస చోరీలు జరుగుతున్నాయి. దీంతో గ్రామప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. మండలంలోని తాడువాయితండాలో నూతనంగా నిర్మించిన గురప్పస్వామ దేవాలయంలో ఈనెల 16న గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడి హుండీని పగులగొట్టి నగదు, స్వామి వారి వెండి ఆభరణాలను దోచుకెళ్లారు. ఈ చోరీ విలువ రూ.లక్ష పైనే ఉంటుందని గ్రామస్తులు తెలిపారు. అదేవిధంగా మండల కేంద్రంలో పక్షం రోజుల క్రితం ఇంటిముందు పార్క్ చేసిన యూనికార్న్, బుల్లెట్ బైక్‌లను గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. తాజాగా శనివారం తెల్లవారుజామున మండల కేంద్రం శివారులో చెరువుకట్టపై గల పెద్దమ్మతల్లి దేవాలయంలో హుండీని పగులగొట్టి నగదుతో పాటు పెద్దమ్మతల్లి ముక్కుపుడకను చోరీ చేశారు. అదేరోజు పక్కనే ఉన్న శివాలయం తలుపులను పగులగొట్టి చోరీకి విఫలయత్నం చేశారు. శనివారం తెల్లవారుజామున పెద్దమ్మతల్లి ఆలయంలో చోరీకి పాల్పడిన ముగ్గురు వ్యక్తులను మునగాల పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. కాగా, మండల కేంద్రంలో రాత్రి సమయంలో పోలీసులు గస్తీ ఏర్పాటు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

చివరి దశకు డబుల్ రోడ్డు పనులు


కొనసాగుతున్న బేతవోలు డబుల్ రోడ్డు తారు పనులు

చిలుకూరు : మండలంలోని బేతవోలు డబుల్ రోడ్డు నిర్మాణ పనులు చివరి దశకు చేరుకున్నాయి. కోదాడ– జడ్చర్ల జాతీయ రహదారిపై చిలుకూరులోని బేతవోలు క్రాస్ రోడ్డు నుంచి బేతవోలు వరకు 8 కిలోమీటర్ల మేర ఆర్‌అండ్‌బీ నిధులు రూ. 16 కోట్లతో డబుల్ రోడ్డు నిర్మిస్తున్నారు. రోడ్డు నిర్మాణంలో భాగంగా గత కొన్నిరోజులుగా కంకర పరచడంతో వాహనాల రాకపోకల సమయంలో దుమ్ముతో వాహనాదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దీంతో సాక్షి పత్రికలో పలుమార్లు కథనాలు ప్రచురితం కావడంతో అధికారులు స్పందించి పనుల్లో వేగం పెంచారు. ప్రస్తుతం తారు వేసే పనులు చేపడుతున్నారు. మరో పది రోజుల్లో రోడ్డు నిర్మాణ పనులు పూర్తికావచ్చని సంబంధిత అధికారులు తెలిపారు.

విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలి


సమావేశంలో పాల్గొన్న వామపక్ష విద్యార్థి సంఘం నాయకులు

కోదాడరూరల్ : ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షించాలని, కార్పొరేట్, ప్రైవేట్ విద్యా సంస్థల్లో ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలని కోరుతూ ఈ నెల 23న నిర్వహించబోయే విద్యా సంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని వామ పక్ష విద్యార్థి సంఘం నాయకులు కోరారు. శనివారం పట్టణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యూ, పీవైఎల్, ఏఐవైఎఫ్ నాయకులు మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రభుత్వ విద్యారంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసి విద్యావ్యవస్థను కార్పొరేట్ వ్యక్తులకు ధారాదత్తం చేసిందని ఆరోపించారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ విద్యారంగ సమస్యలను పరిష్కరిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 19 నెలల గడుస్తున్నా విద్యాశాఖ మంత్రిని నియమించకపోవడం శోచనీయమన్నారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘ నాయకులు నరేష్, ఎం.చందర్‌రావు, దరావత్ రవి, చేపూరి కొండలు, కామళ్ల ఉదయ్, వేణు, అనంతుల రాము, సైదులు ఉన్నారు.